క్లుప్తంగా

పనుల పురోగతిపై సమీక్ష

ఏలూరు(మెట్రో): స్థానిక జెడ్పీ కార్యాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ బుధవారం ఉంగుటూరు, దెందులూరు నియోజకవర్గాల పంచాయతీ రాజ్ ఇంజినీర్ అధికారులతో సమీక్షించారు. జెడ్పీ నుంచి విడుదల చేసిన పనుల పురోగతిపై ఆరా తీశారు. జెడ్పీ సీఈఓ కె.భీమేశ్వర్, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

టీకాలు తప్పనిసరి



టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

దెందులూరు: చిన్నారులకు ఇమ్యునైజేషన్ టీకాలు తప్పనిసరిగా వేయించాలని చాటపర్రు పీహెచ్‌సీ డాక్టర్ ప్రదీప్ తల్లిదండ్రులకు సూచించారు. బుధవారం చాటపర్రు పీహెచ్‌సీలో చిన్నారులకు ఇమ్యునైజేషన్ టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. బిడ్డకు ప్రాథమికంగా తల్లిదండ్రులు ఇచ్చే తొలి రక్షణ చర్య టీకా అన్నారు. ఎంపీహెచ్‌ఈఓ రామాంజనేయులు, ఎంపీహెచ్ ఎస్ కిరణ్, ఏఎన్ఎం సంధ్య, సీహెచ్‌ఓలు పావని, జాహ్నవి, ఆశ కార్యకర్తలు కృష్ణకుమారి, వెంకటలక్ష్మి, జ్యోతి పాల్గొన్నారు.

ఆటిజంపై అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న నిర్వాహకులు, వైద్యులు

ఏలూరు (టూటౌన్): స్థానిక జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం యూపీహెచ్‌సీ సత్రంపాడు-1లో ఆటిజంపై అవగాహన కల్పించారు. మెడికల్ ఆఫీసర్ దీప్తి మాట్లాడారు. ప్రపంచ ఆటిజం దినోత్సవం ఏప్రిల్ 2న నిర్వహిస్తున్నట్టు చెప్పారు. మనుషుల కంటే బొమ్మలు, వస్తువులపై ఆసక్తి చూపించడం ఆటిజం రావడానికి ప్రధాన కారణమన్నారు. ఆంటిజం వ్యాధి జన్యుపరమైన కారణాల వల్ల వచ్చే అవకాశం ఉందన్నారు. సంస్థ కో ఆర్డినేటర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఆటిజంను అధిగమించేందుకు గర్భిణులు మంచి పోషకాహారం తీసుకోవాలని, ఒత్తిడిని తగ్గించుకోవాలని, వ్యాయామాలు చేయాలని సూచించారు. ధూమపానం, ఆల్కహాల్‌కు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ సత్రంపాడు-1 సిబ్బంది, డీడీఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యత డొల్ల.. రోడ్లు గుల్ల

ఏలూరు (టూటౌన్): కూటమి ప్రభుత్వం పని చేసేది గోరంత.. ప్రచారం కొండంత అనే చందంగా తయారైంది. దీనికి ఇటీవల నిర్వహించిన రోడ్ల గోతుల మరమ్మతుల పనులే నిదర్శనం. హడావుడి తప్ప పనుల్లో నాణ్యత లోపం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. ఏలూరు జూట్ మిల్లు సెంటర్ నుంచి కైకలూరు రోడ్డులో, వంగాయగూడెం సెంటర్ నుంచి కొత్తూరు రోడ్డులో రెండు నెలల కిందట గోతులను కంకర, తారుతో పూడ్చారు. మళ్లీ గోతులు ప్రత్యక్షమవటంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. రోడ్ల మరమ్మతులు చేస్తున్నట్టు ఫొటోలకు, పత్రికలకు ఫోజులిచ్చిన నాయకులు ఇప్పుడు పునరావృమవుతున్న గోతులపై స్పందించాలని వాహనచోదకులు డిమాండ్ చేస్తున్నారు.

పాలనపై ఆర్భాటాలు

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 10 నెలలు పూర్తవడంతో ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీల నాయకులు సమావేశాలు పెట్టి మరీ గొప్పలు చెప్పుకుంటున్నారని, ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న విధంగా నగరంలోని రోడ్డు గోతులు దర్శనమిస్తున్నాయని ప్రజలు విమర్శిస్తున్నారు. హడావుడి, ప్రచార ఆర్భాటం మినహా పది నెలల పాలనలో సామాన్యులకు ఒనగూరింది ఏమీ లేదంటున్నారు. గోతులు పూడ్చిన కొద్ది రోజులకే మళ్లీ గోతులు దర్శనమిస్తుండటంతో ప్రజలు విస్తుపోతున్నారు.

రూ.1.25 కోట్లతో మరమ్మతులు

ఏలూరునగర పాలక సంస్థ పరిధిలో మొత్తం రూ.1.25 కోట్ల అంచనాలతో 600 రోడ్లలో మరమ్మతులు చేపట్టామని అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రకటించారు. వీటికి ఆర్అండ్‌బీ రోడ్లలో చేపట్టిన పనులు అదనం. వీటన్నింటినీ హడావుడిగా గతేడాది నవంబరు, డిసెంబరు నెలల్లో చేపట్టారు. ఈ పనుల్లో నాణ్యత లోపించడంతో మళ్లీ గోతులు ప్రత్యక్షమవుతున్నాయి. ప్రధాన రోడ్లు, నిత్యం జనం రద్దీ ఎక్కువగా ఉండే రోడ్లలో మరమ్మతులు చేపట్టడంతో ఇక సమస్య ఉండదనుకున్న ప్రజల ఆనందం మూన్నాళ్ల ముచ్చటగానే మిగిలింది.



ఏలూరు - కైకలూరు రోడ్డుపై దర్శనమిస్తున్న గొయ్యి



చిరంజీవి బస్టాండ్ సమీపంలో ఏర్పడిన గొయ్యి



వంగాయగూడెం సెంటర్‌లో పైకి లేచిపోయిన కంకర రాళ్లు



కైకలూరు రోడ్డులో పునర్‌దర్శనమిస్తున్న గొయ్యి

తూతూ మంత్రంగా పనులు

ఏలూరు-కైకలూరు రోడ్డులో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ మార్గంలో గతంలో రోడ్డును పూర్తిగా బాగుచేశామని చెప్పారు. అయితే ఈ మార్గంలో పలు ప్రాంతాల్లో పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. వంగాయగూడెం సెంటర్ నుంచి ఇటు కైకలూరు వైపు, అటు కొత్తూరు వైపు వెళ్లే మార్గంలోనూ రోడ్ల గోతుల్లో పూడ్చిన కంకర తిరిగి పైకి లేచి దర్శనమిస్తున్నాయి.

నాణ్యతా లోపం



ఏలూరు - కైకలూరు రోడ్డులో మరమ్మతులు చేశారు. తీరా రెండు నెలలు తిరక్కుండానే పలు చోట్ల రోడ్డుపై గోతులు యథావిధిగా దర్శనమిస్తున్నాయి. చిరంజీవి బస్టాండ్‌కు కొంచెం దూరంలో స్పీడు బ్రేకర్ వద్ద ఏర్పడిన పెద్ద గొయ్యి ప్రమాదకరంగా మారింది. ఈ గొయ్యిని గుర్తించేలోపే వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి.

– ఎండీ ఇస్మాయిల్ షరీఫ్, సామాజిక కార్యకర్త, ఏలూరు

అధ్వానంగా రోడ్లు



కై కలూరు రోడ్లు అధ్వానంగా మారాయి. గోతుల్లో పూడ్చిన కంకర రెండు నెలలు తిరక్కుండానే పైకి లేచిన గోతులు దర్శనమిస్తున్నాయి. దీంతో ఆటోలకు, ద్విచక్ర వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ప్రచార ఆర్భాటం మినహా పనుల్లో ఎక్కడా నాణ్యత లేదు. మొక్కుబడిగా కాకుండా పూర్తి నాణ్యతతో చేయాలి. అధికారులు, ప్రజాప్రతినిధులు దీనిపై దృష్టి సారించాలి.

– బి.సోమయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు, సీఐటీయూ, ఏలూరు

వైఎస్సార్ సీపీ నేత జేపీ పరామర్శలు



పాస్టర్ సాగర్‌బాబును పరామర్శిస్తున్న జేపీ



శ్యాంప్రసాద్‌ను పరామర్శిస్తున్న జేపీ

ఏలూరు (టూటౌన్): అనారోగ్యంతో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్న వైఎస్సార్ సీపీ కార్యకర్త పాస్టర్ సాగర్ బాబును ఆ పార్టీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి మామిళ్లపల్లి జయప్రకాష్ (జేపీ) బుధవారం పరామర్శించారు. పాస్టర్ ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. పార్టీ అన్ని రకాలుగా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. అనారోగ్యంతో చికిత్స పొందుతున్న పార్టీ కార్యకర్త మున్నల శ్యాం ప్రసాద్‌ను జేపీ పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. జేపీ వెంట పార్టీ నాయకులు గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్ బాబు, నేరుసు చిరంజీవి, మున్నల జాన్ గురునాథ్, కిలాడి దుర్గారావు, జేవియర్ మాస్టర్, మట్టా రాజు, మేతర సురేష్, బుజ్జమ్మ, గాజుల బాజీ, ఘంటా సాయి ప్రదీప్, గండ రాజేశ్వరరావు, ఏసు పాదం , తదితరులు ఉన్నారు.

అంజుమన్ నూతన కార్యవర్గం ఎన్నిక

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక అంజుమన్ ముహాఫిజుల్ ఇస్లాంకు నూతన కార్యవర్గం ఎన్నికైంది. నూతన అధ్యక్షునిగా ఎండీ జబీవుల్లా, కార్యదర్శిగా అహ్మదుల్లా షరీఫ్, కోశాధికారిగా షేక్ సిరాజ్ బాషా, ప్రచార కార్యదర్శిగా ఎండీ ఇక్బాల్ ఎన్నికయ్యారు. రాజా అహ్మద్, రియాజ్ అలీఖాన్, ఎండీ ఇలియాస్ పాషా అస్లాం అలీ పాషా, ఎండీ సిద్దిఖ్ అలీ పాషా, ఎండీ అనీస్ పాషా, షస్తక్ బాజాబాబు, ఎండీ ఇక్బాల్, ఎండీ ఫైజుల్లా షరీఫ్, షేక్ కరీముల్లా వలీ, ఎండీ గాలబ్ అలీ, ఎండీ సిరాజ్, షస్తక్ సుభాని, ఎండీ సిద్దిఖ్, అక్బర్ ఖాన్, ఎండీ జాకీర్ హుస్సేన్, షేక్ అలీ, సయ్యద్ ఇలియాస్ పాషా, షేక్ ఖాజా హుస్సేన్‌లు వివిధ పదవులకు ఎన్నికయ్యారు. ఈ వివరాలను బుధవారం సాయంత్రం అంజుమన్ హాల్‌లో నూతన కమిటీ ప్రతినిధులు వెల్లడించారు. గత పాలకవర్గం అనేక అవినీతి, అవకతవకలకు పాల్పడిందన్నారు. గత అధ్యక్షుడు సులేమాన్, కార్యదర్శి అమీర్ జానీ అంజుమన్ ఆస్తులను, నిధులను స్వప్రయోజనాలకు వాడుకున్నారని ఆరోపించారు. రూ.వెయ్యి ఖర్చు పెట్టాలన్నా పాలకవర్గం అమోదించాలని, అయితే గత అధ్యక్షుడు సులేమాన్ పాలక వర్గం అనుమతి లేకుండా ఖర్చుచేసిన దాదాపు రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షలకు సంబంధించి వెంటనే లెక్కలు చెప్పాలని, చెక్ పవర్‌ను నూతన కార్యవర్గానికి అప్పగించాలని డిమాండ్ చేశారు.



అంజుమన్ నూతన కార్యవర్గ సభ్యులు

వన్‌స్టాప్ సెంటర్ పనితీరుపై సమీక్ష



రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్): ప్రతి రెండు నెలలకు ఒకసారి వన్ స్టాప్ సెంటర్ పనితీరును సమీక్షించాల్సి ఉందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్న ప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన స్థానిక ప్రభుత్వ ప్రజా వైద్యశాల ప్రాంగణంలో ఉన్న వన్ స్టాప్ సెంటర్‌ను సందర్శించారు. వన్ స్టాప్ సెంటర్‌లో బాధిత మహిళలకు, బాలలకు కౌన్సిలింగ్ నిర్వహించి, ఆసరా కల్పిస్తారని, కుటుంబ వివాదాల పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు. గతేడాది ఏప్రిల్ నుంచి నేటి వరకు 202 కేసులను నమోదయ్యాయని, 427 మందికి వివిధ రూపాల్లో సహాయం చేశాని తెలిపారు. 45 మందికి న్యాయ, 54 మంది వైద్య, 47 మందికి పోలీస్ సాయం, 85 మందికి షెల్టర్ ఇచ్చినట్టు చెప్పారు. కార్యక్రమంలో వన్‌స్టాప్ సెంటర్ అడ్మిన్ నిర్మల, న్యాయవాది కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు ఇంటర్వ్యూలు

ఏలూరు (టూటౌన్): చంద్రన్న స్వయం ఉపాధి సోపానం పథకంలో సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి గురు, శుక్రవారాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఏఎస్ఆర్ స్టేడియం వద్ద ముస్లిం షాదీఖానాలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ఏలూరు నగర పాలక సంస్థ కమిషనర్ భానుప్రతాప్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు 1 నుంచి 13వ డివిజన్ల నుంచి 2102 మందికి గురువారం ఉదయం, 14 నుంచి 25వ డివిజన్లకు చెందిన 1446 మందికి మధ్యాహ్నం ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. 26 నుంచి 38వ డివిజన్లకు చెందిన 1294 మందికి శుక్రవారం ఉదయం, 39 నుంచి 50వ డివిజన్లకు చెందిన 804 మందికి మధ్యాహ్నం ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు.

56 మంది విద్యార్థులకు ఉద్యోగాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక సీఆర్‌రెడ్డి పీజీ కళాశాలలో బుధవారం దివిస్ లేబరేటరీస్ (విశాఖపట్నం) ఆధ్వర్యంలో ఎగ్జిక్యూటివ్ ట్రైనీ ఉద్యోగాల కోసం వివిధ కళాశాలల నుంచి వచ్చిన 150 మంది యూజీ, పీజీ విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. వీరిలో 56 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశామని, వీరు కాకినాడ, విశాఖపట్నం, హైదరాబాద్ బ్రాంచ్‌లలో పనిచేయాల్సి ఉంటుందని కంపెనీ హెచ్ఆర్ ప్రతినిధి ఎ.రాజేష్ తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులను పీజీ కళాశాల కరస్పాండెంట్ కానాల శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ కేఏ రామరాజు, పీజీ డైరెక్టర్ వీఆర్ఎస్ బాబు, ప్లేస్ మెంట్ సెల్ కన్వీనర్ టి.సుబ్రహ్మణ్యం, ఎంబీఏ ఆచార్యులు తేర రాజేష్ తదితరులు అభినందించారు.

సీపీఎం సభలకు ప్రతినిధిగా రవి



ఎ.రవి

ఏలూరు (టూటౌన్): సీపీఎం 24వ అఖిల భారత మహాసభలు తమిళనాడు రాష్ట్రంలోని మధురై పట్టణంలో బుధవారం ప్రారంభమయ్యాయని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి తెలిపారు. ఈనెల 6 వరకు జరిగే ఈ సభలకు తాను ప్రతినిధిగా వెళ్లినట్టు పేర్కొన్నారు. ఈ సభల్లో ప్రస్తుత రాజకీయ విధానాన్ని సమీక్షించి, రాబోయే మూడేళ్లలో తీసుకోవాల్సిన రాజకీయ విధానం, సీపీఎం ఎదుగుదలపై చర్చిస్తామని వివరించారు. ఈ సభలకు దేశవ్యాప్తంగా 880 మంది, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి 25 మంది ప్రతినిధులు హాజరయినట్టు తెలిపారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	20	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	60
వంకాయలు (కాంతులు)	28	బిళ్లచిక్కుడు	84
వంకాయలు (తెలుపు)	28	చామదుంపలు	46
బెండకాయలు	28	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	28	కంద	76
కాకర కాయలు	30-38	బీట్‌రూట్	30
బీరకాయలు	34	కీరా దోస	36
బీరకాయలు (పందిరి)	44	ఫ్రెంచ్‌బీన్స్	90
క్యాబేజీ	16	అల్లం	60
క్యారెట్	32	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	26	పాలకూర	10
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	28	చుక్కకూర	10
గోరుచిక్కుడు	36	గోంగూర	07-10
దోసకాయలు	24-26	పుదీనా	05
అనబకాయ (1)	20	క్యాప్సికమ్	60
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	33
ఏలూరు - జేడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	36
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	37
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	16
ఏలూరు - తిరుపతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	22
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	22
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	27
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	12
ఏలూరు -జేడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	25
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	20
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	20
ఏలూరు - తిరుపతి	16.00	4830	32

గ్రంథాలయాలను అభివృద్ధి చేయాలి



గ్రంథాలయాల పునర్వికాస ఉద్యమానికి మద్దతుగా చేతులు కలిపిన నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గ్రంథాలయాల్ని అభివృద్ధి చేయాలని, ప్రభుత్వం నిధులు కేటాయించాలని, పుస్తకాలు కొనుగోలు చేయాలని గ్రంథాలయాల పునర్వికాస ఉద్యమ వేదిక రాష్ట్ర కన్వీనర్ వల్లూరు శివప్రసాద్ డిమాండ్ చేశారు. వేదిక ఏలూరు జిల్లా ప్రతినిధుల సమావేశం బుధవారం సాయంత్రం స్థానిక ఫ్లాష్ టీమ్ కార్యాలయంలో అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యదర్శి బీఎస్ సాగర్ అధ్యక్షతన నిర్వహించారు. శివప్రసాద్ మాట్లాడుతూ ఆస్తిపన్నులో వసూలు చేసే గ్రంథాలయ పన్నును గ్రంథాలయాల అభివృద్ధికి ఇవ్వడం లేదని, అనేక గ్రంథాలయాలు నిరీర్యం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నూతన పుస్తకాలు కొనుగోలు చేయాలని, ఉద్యోగ నియామకాలు చేపట్టాలని కోరుతూ ఈ నెల 27న విజయవాడ ఎంబీ విజ్ఞాన భవనంలో రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఏపీ గ్రంథాలయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్ వెంకటేశ్వరరావు, మానవత సంస్థ విద్యా కమిటీ చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు, బీఎస్ సాగర్ మాట్లాడుతూ తెలుగు భాష సాహిత్య వికాసానికి అరసం చేస్తున్న కృషిని వివరించారు. అనంతరం ఏలూరు జిల్లా కమిటీని ఎంపిక చేశారు. గౌరవ సలహాదారులుగా లేళ్ల వెంకటేశ్వరరావు, ఆలపాటి నాగేశ్వరరావు, కన్వీనర్‌గా నాగాస్త్ర, కో కన్వీనర్లుగా దేవరకొండ వెంకటేశ్వర్లు, వీరమల్ల మధు, కమిటీ సభ్యులుగా బీఎస్ సాగర్, ఆర్ఎస్ డాంగే, పీపీ శాస్త్రి, ఇబ్రహీం, నిమ్మగడ్డ అశోక్, ఆనంద నాయుడు, పి.ఆంజనేయులు, వీర్ల శ్రీరాములు, వీరభద్రరావు, ముత్యాల సాంబశివరావు ఎంపికయ్యారు. సమావేశంలో అరసం రాష్ట్ర కమిటీ సభ్యులు పరుచూరి అజయ్, అరసం అరుణ కుమార్, ఏలూరు జిల్లా ప్రతినిధులు ఫ్లాష్ శ్రీనివాస్, జీవీఎల్ నరసింహారావు, ఎండీ ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.

అన్న సమారాధన



ఆలయం వద్ద జేపీని స్వాగతిస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): తూర్పు వీధి గంగానమ్మ సంబరం ముగింపు సందర్భంగా గణపతి ఖాదీ వస్త్ర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం అన్న సమారాధన ఏర్పాటుచేశారు. వైఎస్సార్ సీపీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి మామిళ్లపల్లి జయప్రకాష్ (జేపీ) తొలుత అమ్మవారికి విశేష పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఆశీర్వచనాలు పొందారు. అన్నసమారాధనను జేపీ ప్రారంభించారు. గణపతి ఖాదీ వస్త్ర సంక్షేమ సంఘం ప్రతినిధులను జేపీ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గుడిదేశి శ్రీనివాస్, నెరుసు చిరంజీవులు, నూకపెయ్యి సుధీర్ బాబు, మున్నుల జాన్ గుర్నాథ్, లంకలపల్లి గణేష్, కిలాడి దుర్గారావు, కొల్లిపాక సురేష్, ఘంటా సాయి ప్రదీప్, షమీ, గాజుల బాజీ, దేవరకొండ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సాహితీ సంబరాల కన్వీనర్‌గా పార్థసారథి

కొయ్యలగూడెం: అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఏలూరు జిల్లాలో అత్యంత ప్రతిష్టాత్మకంగా మే నెల 10, 11 తేదీల్లో నిర్వహించనున్న ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలు (శ్రీశ్రీ కళావేదిక సాహితీ పట్టాభిషేక మహోత్సవాలు) ప్రోగ్రాం కన్వీనర్‌గా ఏలూరు జిల్లా కొయ్యలగూడేనికి చెందిన ప్రముఖ రచయిత, సాహితీ వేత్త డాక్టర్ టి.పార్థసారథి నియమితులయ్యారు. ఈ మేరకు శ్రీశ్రీ కళా వేదిక అంతర్జాతీయ సీఈఓ కత్తిమండ ప్రతాప్ నుంచి నియామక ఉత్తర్వు లేఖను అందుకున్నారు. తెలుగు సాహిత్యం, తెలుగు కళలు, భాష, సంస్కృతి పరిరక్షణలో భాగంగా సుమారు 2000 మంది కవులు, కళాకారులతో ఏలూరు జిల్లాలోని మహాలక్ష్మి గోపాలస్వామి కల్యాణ మండపంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

పోలసానిపల్లిలో చలివేంద్రం ప్రారంభం

భీమడోలు: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు సక్షమ్ సంస్థ ఆధ్వర్యంలో పోలసానిపల్లి రహదారిపై ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సర్పంచ్ షేక్ రహీమా బేగం బుధవారం ప్రారంభించారు. దివ్యాంగుల సంక్షేమానికి పాటు పడుతున్న సక్షమ్ సేవలు ప్రశంసనీయమని ఆమె అన్నారు. ద్వారకాతిరుమల వెళ్లే భక్తుల సౌకర్యార్థం చలి వేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. అనంతరం మజ్జిగ పంపిణీ చేశారు.

ఆకట్టుకున్న చిన్నారుల నృత్యం

భీమడోలు: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు కార్పొరేట్‌కు దీటుగా విద్యా బోధన అందుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. దుద్దేపూడి పంచాయతీ అన్నేవారిగూడెం యూపీ పాఠశాల 67వ వార్షికోత్సవాన్ని బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. 1958వ సంవత్సరంలో ఏర్పడిన ఈ పాఠశాల అంచెలంచెలుగా యూపీ పాఠశాల స్థాయి చేరిందని, వరకు 1400 మంది విద్యార్థులు చదువుకుని ఉన్నత స్థాయిలో స్థిరపడ్డారని హెచ్ఎం ఎస్‌కే మస్తాన్ పేర్కొన్నారు. 122 మంది విద్యార్థులతో 1వ తరగతి నుంచి 8వ తరగతి వరకు విద్యా బోధన జరుగుతుందని సర్పంచ్ మానుకొండ నాగేశ్వరరావు తెలిపారు.